# ఋణానుబంధం

"నేను చావడానికే నిశ్చయించుకొన్నాను. చద్దామనే ఇక్కడికి వచ్చాను..." అంటూ మధ్యలో కొంచెం నసిగి అలా చూస్తూ ఊరుకున్నాడు అతను.

అది మెరీనా బీచ్. పబ్లిక్ కన్వీనియన్స్ దగ్గరనుంచి అలా లైట్‌హౌస్ పోయేవైపు, బీచ్‌రోడ్ సరసనే వరుసగా చెట్లు ఉన్నాయి. ఆ పక్కనే ఉన్న కొలిచాట్లలో ఇసుకమీద కూర్చుని ఉన్నాము. సమయమేమో మధ్యాహ్నం 2 గంటలు. అతని మాటలు నాకేమీ ఆశ్చర్యం కలిగించలేదు. అలాగే వింటున్నాను. నా వైఖరిలో కొంత నిర్లిప్తత, సానుభూతిలేనితనం, కొంత నిర్లక్ష్యంకూడా గోచరించాయేమో అతను మాట్లాడడం మానేసి చూస్తూ ఊరుకున్నాడు. సముద్రపు ఒడ్డున, అందులోనూ మధ్యాహ్నంపూట అలా ఎందుకు సమావేశమయ్యామో, అతని మాటలు నాకు ఎందుకు ఆశ్చర్యం కలిగించలేక పోయాయో ముందు చెప్పడం అవసరం.

* * *

నేను, మా నరసింహం కడుపు చేత్తో పట్టుకుని ఉద్యోగప్రయత్నంకోసం మద్రాసు చేరుకున్నాము. ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. స్నేహితులందరి ఆతిథ్యం ఏమాత్రం మిగలనివ్వకుండా స్వీకరించేశాం. ఇక ఉండలేము. ఉండకుండా ఉండలేము. ఇంటికి తిరిగిపోలేము. ఆ స్థితిలో రామస్వామి సత్రం చేరుకుని మా జెండా ప్రతిష్ఠించాం.

ఆ సత్రంలో మూడురోజులకన్న ఎక్కువగా ఉండకూడదనే నియమం ఒకటి ఉంది. అయినా మేము దాని నంతగా పట్టించుకోగలిగిన స్థితిలో లేము.

మాముఖాలు కనపడితే చాలు తెలిసినవారంతా పలాయన మంత్రం పఠిస్తున్నారు. ఒకరిద్దరు తిరిగి కనపడడంవల్ల ప్రయోజనమేమీ లేదని చెప్పారుకూడా. మరొకరిద్దరు పుణ్యాత్ములు అడపా తడపా మాకో రూపాయ అర్థ పారేస్తూనే ఉన్నారు.

వాల్‌టాక్స్ రోడ్‌లో ఆరున్నర అణాలకే భోజనం పెట్టే హోటల్ ఉన్న పుణ్యదినాలవి. రూపాయ కళ్ళచూసినప్పుడల్లా భోజనం చేస్తున్నాం. లేనప్పుడు కుళాయి నీళ్ళు కడుపులోపట్టిస్తున్నాము. ఆరోజుల్లో దిన దినం సత్రంలో ప్రవేశించే కొత్తముఖాలను పరీక్షించడం నాకార్యక్రమంగా ఉండేది. పోనీ ఎవరైనా తెలిసినవారు, ఆ మాటికి అదృష్టం ఉంటే మా ఊరివారే కనపడితే వాళ్ళతో పాటు జెండా పీకేసి మా ఊరు పోవచ్చునేమో అని ఆశ. లేకపోతే అధమం ఆపూటకి నాలుగు డబ్బులయినా లభిస్తాయని తాపత్రయపడేవాణ్ణి. మానరసింహం మాత్రం ఇలాంటివేమీ పట్టించుకోకుండా నిర్లిప్తంగా ఈ కష్టసుఖాలతో తన కేమీ నిమిత్తం లేనట్లు సత్రం వసారాలో పక్కపరుచుకుని నవరంధ్రాలు బిగించి, యోగనిద్రలో మునిగి ఉండేవాడు.

మేము సత్రంలో చేరిన వారం పదిరోజులకే కాబోలు అతనుకూడా అక్కడ చేరాడు. ఎవరితోటీ కలిగించుకోకుండా ఒక మూల కాలక్షేపం చేస్తూఉండేవాడు. అయినా అతనితో మాకు ఏలాంటి సంబంధము లేకపోనేమో. కాని ఆతరువాత మా పరిస్థితి విషమించింది. ప్రాణాలు కడంటాయి. మూడురోజులపూటగా తిండి లేదు. కాఫీ కూడా లేదు. ఆఖరికి ఒక సిగరెట్ ముక్క అయినా లభ్యం కాలేదు. నరసింహాన్ని నమ్ముకుంటే చావే గతి. మా ఇరువురి ప్రాణాలు కాపాడుకొనవలసిన గురుతరమైన బాధ్యత నాపైనే ఉంది. నా ప్రాణాలు కడంటినా మా నరసింహాన్ని రక్షించేవారు ఉండరు.

అంతకుముందు కాఫీ త్రాగడానికి ఒకటి రెండు పర్యాయాలు హోటల్‌కి వెళ్లినప్పుడు అతను కూడా మా వెంట వచ్చాడు. ఒకే సత్రంలో ఉంటున్నాం కనుక, ఎప్పటికైనా అవసరం రాకపోతుందా అనీ నేనుమాత్రం అతనివైపుచూసి చిరునవ్వుబాణాలు కూడా విసిరిఉన్నాను.

అతని జేబులో పెద్ద పర్సు ఉంది. అయిదురూపాయల నోట్లు నాలుగుఅయిదు నేను చూస్తూఉండగా మార్చాడు కూడా. ఒకవిధంగా అతనితో వ్యవహారానికి కొంత పునాది వేసిఉన్నాను.

మెమ్మదిగా మా నరసింహాన్ని కదిలించి చూచాను. "చంపకు బాబూ, నన్ను శాంతంగా నిద్రపోనిమ్మ"న్నాడు మా నరసు. "నిద్రపోవడానికి కావలసినంత టైమ్ ఉందిలే. కొంచెం సలహా ఇమ్మ"ని అడిగాను. "సలహా ఇచ్చేపాటి తీరిక లేదు. అయినా చెప్పు, వింటాను" అన్నాడు, మావాడు అలాగే కళ్లు మూసుకుని.

"చూడు. కొంచెం పెద్ద మనిషిలాగే ఉన్నాడు. ధర్మాత్ముడులా కనపడుతున్నాడు. చదువుకున్నవాడు కూడా. ఎవరితోటో ఇంగ్లీషులో అనర్గళంగా మాట్లాడడం విన్నాను. అన్నిటినీ మించి డబ్బు ఉంది. మన పెద్దమనిషితనం, మన తెల్లటి లాల్చీలు, పైజామాలు, కళ్ళజోళ్ళు చూపి ఒక్క పూట తిండికయినా పాటుపడలేమా" అని అడిగాను. మావాడికి నా సంగతి క్షుణ్ణంగా తెలుసు. కంగారు పడలేదు. "ఇదివరకే పునాది వేసినట్లున్నావు. అయినా ఇంత స్వల్పమైన విషయానికి నా సలహా దేనికి? నాకేమో ఈ లంపటం లేదు. నీకు కావాలంటే కానీ..." అన్నాడు.

మెమ్మదిగా లేచి అతని దగ్గరికి వెళ్లాను. అతను హోల్‌డాల్ పరుచుకుని పడుకుని సత్రం పైకప్పు వాసాలు కాబోలు లెక్కపెట్టుతున్నాడు. నా రాక కూడా గమనించలేదు. "మీతో కొంచెం పనిఉండి వచ్చాను" అని గంభీరంగా అంటూ కొంచెం దగ్గి ఊరుకున్నాను. ఆ వ్యక్తి నా వంకకు తిరిగి అలాగే అర్థంలేని చూపు చూస్తూన్నాడు. పారిపోతున్న ధైర్యం చిక్కపట్టుకుని, "పాపం మీ ఆలోచనలకి అంతరాయం కలిగించాను కాబోలు. మళ్ళీ వస్తాను" అంటూ వెనక్కి తిరుగుతున్నట్లు నటించాను. అతను లొంగి

"తూలికాభూషణ్"

పోయారేమో లేచి కూర్చుని “అబ్బే పరవాలేదు. రండి, కూర్చోండి” అన్నాడు.

నేను కూర్చుంటూనే “మీతో ఏ మాత్రం పరిచయం లేకపోయినా, ఏదో ఒకచోట ఉంటున్న కారణంచేత ఆత్మీయులుగా తోచి వచ్చాను. ఏమీ అనుకోకండి” అన్నాను.


నేను గాంభీర్యం మరికొంత హెచ్చించి, నా సోది వెళ్ళబెట్టాను— “మనియార్డరు రావడం ఆలస్యమైంది. అదైనా పల్లెటూరినుంచి రావాలి. పైగా ఈ పోస్టాఫీసువాళ్లు కూడా ఒక్కొక్కప్పుడు తగని ఆలస్యంచేస్తూ ఉంటారు. నాతో ఉన్న ఆయన (మా నరిసిగాడు) పెద్దకవి. రచయిత. కొంచెం అస్వస్థతగా ఉంటున్నాడు. మందుకి మాకుకి కూడా డబ్బు అవసరం. మొదట లెక్కలేకుండా ఖర్చుచేయడం వల్లను, అనుకున్న వేళకి డబ్బు రాకపోవడంచేతను ఆకస్మికంగా ఈ చిక్కులో పడ్డాము. అందుకని......అంటూ తతిమ్మాది ఆయన ఊహాశక్తికే విడిచిపెట్టాను.

అయ్యో, అలాగా పాపం! నేను కూడా ఒకప్పుడు ఇలాంటి బాధలు పడ్డవాణ్నే, మీరేమీ సందేహించకండి. అయిదు రూపాయలు ఇస్తాను. తీసుకోండి. అంతగా కావలసివస్తే మళ్ళీ తరువాత ఇస్తాను. నాదగ్గరకూడా డబ్బు అయిపోతోంది. లేకపోతే మీకు మరికొంత ఇప్పుడే ఇవ్వగలిగి ఉండేవాణ్ణి అంటూ అతను అయిదురూపాయల నోటొకటి నా చేతిలో పెట్టాడు.

సత్రాలలో ఎక్కువ అనుభవం లేని అమాయకుడు. మంచివాడు. ఒకప్పుడు ఇలాంటి కష్టాలు అనుభవించానని చెబుతున్నాడు. మొగమాటం నటిస్తూనే నోటు మడతపెట్టి జేబులో భద్రపరిచి ‘భోజనం టైమ్ అయింది. మీరు కూడా రండి’ అంటూ బలవంతంచేసి, ఆయన వద్దంటూ ఉన్నా మొత్తంమీద ఆయన్నూ కూడా లేవదీశాను. దారిలో తెలుసుకున్నాను. అతని పేరు శంకరరావు.

ఆరోజు మధ్యాహ్నం అతని భోజనం టిక్కెట్టుకూడా నేనే కొన్నాను. అతను ఎంత వద్దన్నా వినిపించుకోక నేనే డబ్బులిచ్చి టిక్కెట్లు కొన్నాను.

మావాడు ఇదంతా ఓరకంటితో కనిపెట్టి అతను చేతులు కడుక్కుంటున్న




సమయంలో "నీ ఉద్యమం సఫలమగుగాక" అని నన్ను ఆశీర్వదించాడు. 'నిండు మనంబు, నవ్య నవనీతసమానము..."

మరొక రెండు రోజులపాటు ఒంటి పూటే భోజనం చేస్తూ ఉన్నా మొత్తం మీద మా పరిస్థితి సౌఖ్యంగానే ఉంది. కడుపులో కొంత స్థిమిత పడింది. ఈలోగా అతను ఇరవై నాలుగు గంటలు మాతోనే కలసి ఉండేవాడు. అంతవరకు అతని ఉదంత మేమిటో మాకు తెలియదు. ఆ మాటకి మా నిజమైన ఉదంత మేమిటో అతనికి ఈనాటికీ తెలియదు.

ఆ రోజు సాయంకాలం. రాత్రిళ్లు ఫలహారం మాత్రం చేసి తేలికగా పడుకుని, ఆరోగ్యం కాపాడుకుంటున్నాం. ఆ వేళ అతను భోజనానికి వెళ్ళడం మానేశాడు. పక్క మీద పడుకుని కదలనన్నాడు. బలవంతం పెట్టడం మంచిది కాదనుకున్నాను. అతనిచ్చిన అయిదు రూపాయలు అయిపోయే సమయం వచ్చింది. మళ్లీ కొంత పుచ్చుకోవలసిన అగత్యం ఏర్పడుతుంది. అతని మాటప్రకారమే అతన్ని విడిచిపెట్టి కాఫీ త్రాగివచ్చాం నేను, మా నరసింహం.

అప్పటికి అతను ఇంకా పడుకునే ఉన్నాడు. దుప్పటి ముసుగు పెట్టుకొని ఉన్నాడు. లోపల్లోపల కుమిలి కుమిలి ఏడుస్తున్నట్లు తోచింది. అది చూస్తూనే ఏమాత్రం చలించకుండా నరసింహం తన పక్క వద్దకు చేరుకుని మళ్ళీ సమాధిలో పడ్డాడు. నేను మా ఉభయుల భవిష్యత్ క్షేమందృష్ట్యా శంకరరావు దగ్గరికి పోయి కొంచెం ఓరడించి, నెమ్మదిగా సంగతి సందర్భాలు తెలుసుకొనడానికి ప్రయత్నించాను. శంకరరావు కొంచెంసేపు తన దుఃఖానికి కారణం ఇదనీ, అదనీ, ఏమీ లేదనీ నటించి తప్పించుకొనడానికి యత్నించాడు. సానుభూతి చిప్పిలుతున్న నా స్వరం మాహాత్మ్యమో లేక దుఃఖం అతిశయించిందో ఏమో కాని "ఇక్కడ కాదు. బీచికి పోదాం రండి. మాట్లాడుకుందాం" అన్నాడు. కాలినడకనే మెరీనా బీచికి పోయాం. అప్పుడు ఎనిమిది ఎనిమిదిన్నర అవుతుందేమో నా దృష్టిమాత్రం శంకరరావుమీదనే ఉంది.

బీచ్ చేరుకున్న తరువాత అతను నెమ్మదిగా తన కథ అంతా బయటపెట్టాడు.




తండ్రి స్కూళ్ళ ఇన్‌స్పెక్టరు. తనకి బియ్యే పరీక్ష తప్పింది. సెప్టెంబరుకి పోతున్నాడు. విపరీతంగా చదివేసి, మంచి పకడ్‌బందీగా తయ్యారయ్యాడు. పెళ్లికూడా అయింది. భార్య ప్రసవించే సమయంకూడా సమీపంలోకి వచ్చింది. ఈ పర్యాయమైనా పరీక్షలో పాసయ్యేయోగ్యత ఉందా లేదా అని తండ్రి ప్రశ్నించాడు. కష్టం కలిగింది. మొదటిమాటు భర్త పరీక్ష తప్పడం తనకే అవమానకరంగా ఉందని భార్య ఎవరితోనో అనగా విన్నాడు. కొంచెం కలిగిన వారి బిడ్డ కావడం భార్యకి గర్వకారణం. ఆపైన వేళాపాళా లేకుండ తనను హాస్యం చేసి, వెర్రి ఎత్తిస్తూ ఉంటుంది. ఆ తరువాత భార్యతో చాలా రాద్ధాంతం జరిపాడు. చివరికి భార్య పుట్టింటికి పంపేయండి పోతానంది. ఇంకా ఆ భార్యాభర్తల మధ్య ఏమేమి రాద్ధాంత సిద్ధాంతాలు జరిగాయో అతను చెప్పలేదు. కాని మొత్తం మీద కొంప విడిచిపెట్టి తండ్రితో చెప్పకుండా డబ్బు తీసుకుని పారిపోయివచ్చాడు. అప్పుడే పక్షంరోజులకి పైగా అయింది.

మద్రాసు వచ్చిన నాలుగయిదు రోజులకి కాబోలు మరొక సంఘటన జరిగింది. దగ్గరబంధువే మామగారి తోడల్లుడు ఒకాయన కనిపించాడు. బలవంతపెట్టి ఇంటికి తీసుకుని వెళ్ళాడు. మర్యాదగా భోజనం పెట్టారు. ఆ తరువాత తండ్రితో చెప్పకుండా పారిపోయివచ్చినందుకు, ముఖ్యంగా భార్యని విడిచివచ్చినందుకు సన్నసన్నగా చివాట్లు పెట్టాడు. ఆ ఇంటిల్లిపాదీకూడా అదే ధోరణిలో మాట్లాడారు. ఇంట్లోనే ఉండిపొమ్మని బ్రతిమాలారు. "తండ్రికి ఉత్తరమైనా, టెలిగ్రామ్, అయినా ఇచ్చి రప్పిస్తాం పరీక్షకి వెళ్ళడం మానేయకు నాయనా. నీ జీవితం, నీభార్య జీవితంకూడా ఎందుకు పాడుచేసుకుంటావు" అని హితవు చెప్పారు. తరువాత కనపడతానని హామీ ఇచ్చి, ఎలాగో వారిని వదుల్చుకుని, వెంటనే అడ్రసు మార్చుకుని, సత్రంలో చేరుకుని ఇలా కాలం గడుపుతున్నాడు.

ఈ సంఘటన లన్నిటితో విరక్తి మరింత ఎక్కువయింది. తనువు చాలించుకొనడానికి మొదట తీసుకున్న నిర్ణయం మరింత బలపడింది. అంతవరకు తన ఆచూకీ ఎవరికీ తెలియకుండా సత్రంలో ప్రచ్ఛన్నంగా ఉంటున్నాడు.

ఇదంతా నా చెవిని పడవేసి, మొదట తన ఆచూకీ మాత్రం ఎవరికీ తెలియపరచవద్దని కోరాడు శంకరరావు. నా స్నేహితుడైనా అవసరానికి దేవుడిమీద ఒట్టు వేసుకుని అతనికి నమ్మకం కలిగించాను.

అతని ఉదంతమంతా వింటున్నప్పుడే ఇందులో నాకర్తవ్యం ఏమిటని ప్రశ్నించుకున్నాను. ఒకటికాదు, ఏకంగా మూడు కర్తవ్యాలు గోచరించాయి. మొదటిది మహా ప్రధానమైనది. మా (నేను, మా నరసింహం) పరిస్థితి విషమంగా ఉంది. ప్రాణదాతలా ఇతను కనపడ్డాడు. మరొక ఆపద్బంధువు ఎవరైనా తటస్థపడి, మమ్మల్ని ఊరినుంచి పంపేసి మమ్మల్ని ఉద్ధరించేవరకు మాకు కొంత డబ్బు అవసరం. అందుకని శంకరరావుని కూడా మా దగ్గరే ఉంచుకుని, అతని డబ్బుకి కూడా బాధ్యత వహించి, కాలం గడపడం.

రెండవది చావడానికి నిశ్చయించుకున్నాడు. చస్తానని చెప్పాడు. బంధువులు హితబోధచేసిన తరువాత జీవితంపై విరక్తి మరీ అధికమైంది. ఈ స్థితిలో "వద్దు నాయనా" అంటే విరక్తి హెచ్చి నిజంగానే చచ్చిపోవచ్చు. అందుచేత కాదు కూడదు అని చెప్పడం మంచిది కాదు.

ఇక మూడవది. చూస్తూ ఊరుకున్నప్పటికీ అదే పరిణామం సంభవించి, అతను నిజంగా చచ్చిపోవచ్చు. అలాంటి అవాంతరం రాకుండా చేయడానికి ముందు అతని సానుభూతిసంపాదించి, చచ్చే మార్గం ఉపదేశించగలిగిన దేశికుడుగా, మిత్రుడుగా నటించాలి.

నెపోలియన్ చక్రవర్తిలా యుద్ధవ్యూహం పన్నాను. అప్పటికి అతను మాట్లాడడం కూడా పూర్తి అయింది. కార్యరంగంలో ప్రవేశించడానికి సూచనగా ఒక సుదీర్ఘమైన నిశ్వాసం విడిచాను. అయినా ముందు నా ధర్మం నిర్వర్తించుకోవాలనుకున్నాను. "మీతో చెప్పకూడదు కాని, నా ధర్మం. ఒకమాట అంటాను. మీరు యువకులు, భవిష్యత్తు అంతా మీ చేతుల్లో ఉంది. కష్టం వచ్చింది. రాలేదనే టంతటి మూర్ఖత్వం లేదు నాకు. అదేమో తక్కువ కష్టం అనికూడా అనను. అయినా కొంచెం తొందర పడి ఇలాంటి నిర్ణయానికి వచ్చారేమో అనే భయం కలుగుతోంది" అని అతనివంక సాభిప్రాయంగా చూచాను. శంకరరావు మొదట చెప్పిన విధంగానే తిరిగి తన నిర్ణయం గురించి చెప్పాడు. చిరుకోపం కూడా వచ్చిందేమో అనుకుంటాను.

"ఏమైనా చావడానికే నిశ్చయించుకున్నాను. ఇంక మీరు ఈ విషయంలో ఏమీ చెప్పబోకండి. మీతో మాట్లాడడమే మానేయవలసివస్తుంది" అన్నాడు శంకరరావు కఠినంగా. నా ఊహ సరిఅయిందే అనుకుని అతని కోపం తగ్గించి ఓరడిం

చాను. ఇక మనిషిని దగ్గరకు తెచ్చుకోవాలి. మళ్ళీ మొదలుపెట్టాను.

"మీవిషయంలో పెద్ద అన్యాయం జరిగింది ఇలాంటి సందర్భాలలో తనవారిపై ప్రతీకారం తీర్చుకోలేని వ్యక్తి—అసలు మానవత్వం ఉన్నవాడెవడూ అలాంటి పని చెయ్యలేడు— అవమానం మరచిపోలేనివాడు— ఇదుగో మీరు అవలంబించిన మార్గమే చూసుకుంటాడు. అందుకే నేను మీ కథ విని విచారపడడానికి బదులు-ఒక రకంగా - అదేమిటో సరిగా చెప్పలేక పోతున్నాననుకోండి— మీ రంటే ఒక రకమైన గౌరవం కూడా కలుగుతోంది" అన్నాను. అతను తల పంకించి అలాగే వింటున్నాడు.

ఆ వెంటనే తిరిగి అందుకుని ఇలా అన్నాను—"మీ కో విషయం చెప్పాలి. నాతో ఉన్నాడే? మా నరసింహం-కవి, మంచి రచయిత అని కూడా మొన్న మీతో చెప్పాను. వాడు కూడా ఒకప్పుడు సరిగ్గా ఇలాంటి అవస్థలోనే పడ్డాడు. ఎటొచ్చీ ఒకటే తేడా. పరీక్షమాత్రం తప్పలేదు. తతిమ్మాదంతా మీకు జరిగినట్లుగానే జరిగింది. తండ్రి కొడుకుని కసిరి, పనిలేని వెధవకి తిండి పెట్టడం శుద్ధదండగ అని ఇంట్లోంచి పొమ్మన్నాడు. అప్పటికే మా నరసింహానికి పెళ్ళి అయింది. పెద్దవాడు కూడా పుట్టాడనుకుంటాను. (ఇది విన్నట్లయితే మా నరసింహం తన యోగనిద్రలోంచి లేచి, నా ప్రాణం తీసి ఉండును. వాడికి అప్పటికి కాదు, ఇప్పటికి కూడా పెళ్లి అవలేదు.) అంటే ఇల్లు విడిచిపోయాడు మా నరిసింహం. ప్రాణం మీద విరక్తి పుట్టింది. చచ్చిపోను దేశానికి తీరని నష్టం వచ్చిఉండును. అదృష్టవశాత్తూ ఆ స్థితిలో నా కంటపడ్డాడు. వాడి జీవితం మళ్ళీ వెలుగులోకి వచ్చింది. అదంతా ఒక పెద్దగాథ. మిమ్మల్ని విసిగించడం నాకు ఇష్టంలేదు. ఈ సమయం కూడా అందుకు తగిందికాదు. ఇంతకీ చెప్పవచ్చేదేమంటే అలాంటి అవస్థ ఒకప్పుడు కాకపోతే మరొకప్పుడైనా ప్రతిమానవుడు విధిగా అనుభవించితీరాలి. లేకపోతే వాడి జీవితానికి తగిన రాణింపు ఉండదు."

"ఏమిటీ మీ స్నేహితుడు కూడా ఇలాంటి అవస్థలోపడ్డవాడే నన్నమాట. అయితే ఏంలెండి? నాలాంటి నిర్భాగ్యులు ఎవరూ ప్రపంచంలో ఉండరు" అన్నాడు శంకరరావు. కొంచెం ఆసక్తి పుట్టింది కాబోలు. "ఆయన గాథ చెప్పండి వింటాను" అని అడిగాడు కూడా.

"తరువాత ఎప్పుడైనా చెబుతాను. ఇప్పటికే ఆలస్యమయింది. పదండి సత్రానికి పోదాం" అంటూ లేచి దారితీశాను. మాట్లాడకుండా అతను కూడా నన్ను అనుసరించాడు.

ఆ రాత్రి అంతా పిచ్చాపాటీ చెప్పుకుంటూ కాలం గడిపాము మరునాడు మధ్యాహ్నం భోజనం చెయ్యడానికి తగినంత డబ్బులేదు. అలాగే పడుకుని ఉన్నాము. అతను చూచి, సంగతి గ్రహించాడేమో మాదగ్గరికి వచ్చి, భోజనానికి పోదాంరండి అని అడిగాడు. "లేదు. మీరు వెళ్లిరండి, మేము తరువాత భోజనంచేస్తాము" అని సమాధానం చెప్పాను. అతనుకొంచెం నీరసంగా నవ్వి, "మీదగ్గర డబ్బు అయిపోయిందనుకుంటాను. పరవాలేదులెండి. నేను ఇలా అంటున్నానని ఏమీ అనుకోకండి. మన చనువునిబట్టి ధైర్యంగా మాట్లాడేస్తున్నాను నాదగ్గర ఇంకా కొంచెం డబ్బుఉంది. అదికూడా ఖర్చుపెట్టుదాం, రండి" అన్నాడు.

"ఎందుకు లెండి? ఈ రోజు ఎలాగో కళ్ళుమూసుకుని కాలంగడిపామంటే రేపటికి మాడబ్బు ఎలాగూ అందకమానదు. మొన్న ఆదివారం మావాళ్లు పంపి ఉండరు. నిన్న సోమవారం. ఈ వేళ మద్రాసు చేరుకున్నా, రేపుకాని బట్వాడా చెయ్యరు. ఇంతలోకీ కొంప మునిగిపోయేదేమీ లేదు. మీరు వెళ్ళిరండి "అన్నాను"

"ఎంత మాటన్నారు? తిండిలేకుండా ఉండడం ఎంత బాధ? మీరు రావలసిందే. మీరురాకపోతే నేనుకూడా వెళ్ళను. అంతా ఇక్కడే పడి ఉందాం"అన్నాడు శంకరరావు.

మా నరసింహులు సమాధిభగ్నమైనట్లుంది. లేచాడు. "ఆయన అంతగా చెబుతున్నప్పుడు ఏమిట్రా ఆ వాదన? పద పోదాం లేకపోతే ఆయన మనస్సు కష్టపడుతుంది. ఒకసారి తీసుకోగా లేంది ఇప్పుడేమిటి అవమానం? ఈ డబ్బుకూడా తిరిగి ఇచ్చేద్దాంలే. రండి, శంకరరావుగారూ, మేము కూడా వస్తాం. మాకోసం మీరు భోజనం మానుకోవడమేమిటి? అన్యాయం" అంటూ పైపంచ భుజం మీద వేసుకుని నరసింహం హోటల్ కి దారితీశాడు.

భోజనాలయినతరువాత తిరిగి వస్తూ ఉండగా నేను పదేపదే చెబుతున్న కారణంచేత కాబోలు శంకరరావు ఖండితంగా చెప్పేశాడు: "ఈ భోజనం డబ్బులు మాత్రం మీరు నాకు ఇవ్వవద్దు. ఆ వేళ నా భోజనానికి మీరు దగ్గర డబ్బులేక పోయినా టిక్కెట్టు కొన్నారా, లేదా? అలాగే ఇదీని. కాదంటారా, నే నసలు మీదగ్గర డబ్బే తీసుకోను" అని.

నేనుమాత్రం ఇంక అనుమానించడం తగదనుకున్నాను "సరే, ఇంతవరకువచ్చిన తరువాత మీతో దాపరిక మెందుకు? మీ దగ్గర మరి కొంతడబ్బు తీసుకోక తప్పదు. చాలా అవసరం. అసలు మీదగ్గర ఎంత ఉంది?" అని అడిగాను. అతను పర్సు పైకి తీసి లెక్కపెట్టగా ఏడురూపాయల పై చిల్లర ఉంది. అతనికి ఆరాత్రి భోజనానికి, మర్నాటి మధ్యాహ్నం భోజనానికి, రెండుపూటలు కాఫీ ఫలహారాలకు రెండు రూపాయలు ఆపై చిల్లర ఉంచుకోమని చెప్పి, అయిదు రూపాయలు ఇమ్మని అడిగాను ఇచ్చాడు మరునాటికి మాకు ఎలాగూ మనియార్డరు వస్తుందిగా?

ఆరోజు సాయంకాలంకూడా మా నరసింహాన్ని సత్రంలోనే విడిచి, బీచికి పోయాము అక్కడ అతని చదువుగురించి, బి. ఏ లో మొదటి ఏడాది పరీక్షలోను, యూనివర్సిటీ ఎగ్జామినేషన్లలోను, అతనికి వచ్చిన మార్కులు గురించి, వనకటిరికార్డుగురించి చాలా ప్రశ్నలు వేసి తెలుసుకున్నాను అంతా విని, "అబ్బో. మీరు అఖండులిలా ఉన్నారే అసలు మీకు ఆ ఏడాది పరీక్ష ఎలా తప్పిపోయిందో, వింతగా ఉంది ఈసారి మీకు డిస్టింక్షన్ తప్పకుండా వస్తుంది లెండి" అన్నాను.

"క్రిందటిసారే డిస్టింక్షన్ తప్పక రావలసింది. సరిగా పరీక్షలకి ముందు టైఫాయిడ్ వచ్చి, మంచంమీద పడ్డాను. ఇదిగో, ఇంకా ఇప్పటికీ ఆ నీరసం వదిలింది కాదు" అన్నాడు శంకరరావు విచారంగా.

"అవును. మీరు చాలా నీరసంగా కనపడుతున్నారు. పోనీ, ఏదైనా టానిక్ వాడలేకపోయారూ" అన్నాను. అతనేమీ సమాధానం చెప్పలేదు. ఆలోచనలో పడ్డాడు.

నేను కూడా అతని విషయం గురించే ఆలోచిస్తూ ఉండిపోయాను. మొదట మా నరసింహం కూడా ఒకప్పుడు అలాంటి అవస్థలోనే పడ్డాడని చెప్పడంలో అతనికి మా ఇరువురిపట్ల కొంత అభిమానం ఆత్మీయత కలిగినవి. మళ్ళీ పరీక్షల్లో గెలుపొందాలనే కాంక్షతోపాటు, మొదటి తరగతిలో ఉత్తీర్ణుడై నలుగురిలో ఆధిక్యం తెచ్చుకోవాలనే ఉబలాటం కూడా కలిగింది. ఆరోగ్యంవిషయం పదేపదే ప్రస్తావించి సానుభూతి చూపడంవల్ల అతనికి తనమీద జాలి అధికమైంది. ఇవన్నీ అతను చావకుండా చేయడానికి ఉపయోగిస్తాయి.

(45-వ పేజీ చూడండి)

## ఋణానుబంధం

(7–వ పేజీ తరువాయి)

ఇక ఆఖరి అస్త్రం కూడా ప్రయోగించి, ఈ కథ ముగించాలనుకున్నాను.

ఆ మరుసటిరోజు కూడా అనుకున్నట్లుగానే మాకు డబ్బు రాలేదు. శంకరరావు దగ్గర డబ్బు కూడా అయిపోయింది. ఆ రాత్రి అంతా కలిసి పస్తు పడుకున్నాము. శంకరరావు మమ్మల్ని భోజనానికి పిలవనూ లేదు. మేమాతన్ని కదపనూ లేదు. సాయంకాలంమాత్రం అతన్ని యధావిధిగా బీచ్‌కి తీసుకొనిపోయాను. ఈ పర్యాయం నేనే అతని ఆత్మహత్యా ప్రయత్నం గురించి కదిలించాను. అంతవరకు అతను ఆ విషయం తలపెట్టలేదు.

ఆరోజు ముఖ్యంగా చావడానికి ఉన్న మార్గాలు గురించి చర్చించడం ప్రారంభించాను. "చూడండి. చావడానికి చాలా మార్గాలే ఉన్నాయి వాటిని స్థూలంగా రెండురకాలుగా విభజించవచ్చునని నా అభిప్రాయం. ఒకరకం బాధించేవి. రెండవరకం ఏమాత్రం బాధలేకుండా క్షణమాత్రంలో సునాయాసమరణానికి దారితీసేవి. కార్లకిందపడడం, ట్రాములకింద పడడం, కాలవల్లోకి నదుల్లోకి దూకడం వంటివి బాధించేవి. కార్లకిందపడి ఒకవేళ చావకుండా ఏ కాలుఅయినా, చెయ్యి అయినా పోగొట్టుకుంటే? ఇక వాడి అవస్థ ఆ భగవంతుడికే తెలియాలి. ఒకరకంగా ఎలక్ట్రిక్ వైర్సు ముట్టుకుని, స్విచెస్‌లో చేతులుపెట్టి చావడానికి ప్రయత్నించడం కూడా అలాంటిదే. ఆ మధ్య నేనో శవాన్ని చూచాను. ఒళ్లంతా మాడిపోయి నల్లగా కొరివిలా తయారయింది" అన్నాను.

ఆ మాటలు వింటూ అతను కొంచెం కంపించాడు. సమాధానంకోసం ఎదురుచూడకుండా ఇంకా అదే ధోరణిలో చెప్పుకుపోసాగాను— "సముద్రంలోపడి చచ్చేవారి సంగతి కూడా అంతమాత్రమే. చటుక్కుని చావకుండా చేయడానికి ఏషార్కు అయినా మన్ని నీటిమీదికి తేల్చి పట్టుకుని, కొంచెం కొంచెం చప్పరించడం మొదలెడితే? ఎంత బాధ అని. అలాంటివి జరగవనుకోండి. షార్కులు ఉన్నాయే? అమాంతం పకోడీనమిలినట్లు నమిలేస్తాయి కాని ఆవిధంగా మనతో చెలగాటం ఆడేటంత తీరిక ఉండదు వాటికి..."

నా మాటలకి అడ్డువచ్చి "ఇతర విషయాలేమైనా మాట్లాడుకుందాం లెండి ఈవేళ ఏమిటో నా మనస్సు మనస్సులో లేదు" అన్నాడు శంకరరావు. ఇతర రకాల ఆయాస మరణాలు గురించి, సునాయాస మరణాలు గురించి చెబుతామన్నాను కాని శంకరరావు వినిపించుకోలేదు.

ఆ తరువాత సత్రానికి తిరిగివచ్చే దారిలో సంభాషణ మార్చి, రామాయణం గురించిన చర్చ తెచ్చాను. అతనికి పురాణాదులంటే కొంత భక్తి ఉంది. ప్రసంగవశాత్తు భర్త అన్నగారితో అరణ్యవాసానికి పోతే 14 సంవత్సరాలపాటు ఏకధాటిగా నిద్రపోయిన ఊర్మిళాదేవి చరిత్ర, కన్న కొడుకుతో వియోగం భరించలేక ప్రాణాలువీడిన దశరథ మహారాజు ఉదంతం, భర్తలతో ఎడబాటు భరించలేక ఆత్మహత్య చేసుకున్న పతివ్రతాశిరోమణుల ఇతివృత్తాలు, తండ్రులు ఇల్లు విడిచిపోతే దిక్కులేక బిచ్చగాళ్లగా అనాధులుగా జీవిస్తున్న పిల్లల గాధలు ముచ్చటించాను. ఇంకా ఎన్నో చిత్రవిచిత్రమైన అనుభవాలు ఏకరువు పెట్టాను. అతను అలాగే నన్ను మాట్లాడనిచ్చి, మౌనంగా ఉండిపోయాడు.

ఆ రాత్రి అప్పటిదాకా జరిగిన కథ అంతా మావాడి (నరసింహం)తో చెప్పగా, "ఒరేయి, ఆట ఆడుతున్నావు. ఇది ఒక మనిషి నిండుప్రాణాలికి సంబంధించిన విషయంసుమా. వాడు (శంకరరావు) నిజంగానే చచ్చిపోయాడంటే నీ పీక నులిమేస్తానుసుమా" అని హెచ్చరించాడు.

తిరిగి కొంచెంసేపు ధ్యానముద్ర ధరించి తనను సమాశ్వసించుకోడానికి ఇలా అన్నాడు: "ఎవడిదగ్గర్నుంచి అయినా ఒక్కచిల్లి డబ్బు రాబట్టే ఆశఉంటే వాణ్ణి చావనివ్వవని నాకు తెలుసులే. నువ్వు చేసినదంతా వాళ్లనాన్నకి తెలియపరిచావంటే ఆయన నిన్ను బంగారంతో కప్పెయ్యడూ ?"

నరసింహం అన్న మాటల్లో కొంత యధార్థం లేకపోలేదు. అయినా నాకు మాత్రం వాడి మాటలు మహా అవమానకరంగా తోచాయి. ఆరోజు మా నరసింహానికి పెళ్లి అయిందనీ, పిల్లవాడు కూడా పుట్టాడనీ శంకరరావుతో అబద్ధం చెప్పి, ఒకరకంగా ముందుగానే మా నరసింహం మీద ప్రతీకారం


# రూ 900

రూ 400 రైటు—రూ 200 ఒక తప్పు—రూ 100 రెండు తప్పుల— రూ 50 మూడు తప్పుల ఆన్సర్లు పంపినవారికి మార్పులేని గ్యారంటీ బహుమతులు!!

★ రూ 100 నాలుగు రూపాయలకు పైగా విలువగల కూపన్లు పంపినవారిలో 25 మందికి—రూ 50 రెండు రూపాయలకు పైగా విలువగల కూపన్లు పంపినవారిలో 25 మందికి లాటరీపద్ధతి బహుమతులు.

## ముగింపు తేదీ 18-6-52

ప్రవేశరుసుము:–రూపాయికి 2 కూపన్లు, రూ 2–0–0 లకు 6 కూపన్లు పంపాలి.

★ కీసొల్యూషన్ డిస్ట్రిక్టు కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకిలో డిపాజిట్ చేసితిమి.

★ నిఘంటువు:–శబ్దార్థచంద్రిక.

1 —భవ
2 —పకారము
3 —యము
4 అ—రము
5 —టరి
6 — —స్పతి
7 — దరు
8 —రంగము
9 —ర్ణము

## ఆధారములు (అన్నీ అడ్డముమాత్రమే)

1. ఒక సంవత్సరము 2. ఇది చేసినవారిని త్వరగా మరువలేము 3. ఇది పోయినపిమ్మట తిరిగి పొందుట సాధ్యముకాదు 4. నిత్యము కానిది 5. ఇతనికి దూరముగా వుండమని పెద్దలు చెప్పుదురు 6. దేవతలలో శ్రేష్ఠుడు 7. దొంగతనము చేయువారి కిది వుండకపోదు 8. ఒక జంతువు 9. ఇది మనకు చాలా అవసరము

★ నిబంధనలు: ఎన్ని కూపనులైననూ చక్కగా సిరాతో వ్రాసి పంపాలి. రుసుము మనిఆర్డరుద్వారా పంపవలెను. కీసొల్యూషన్ 25–6–52 ఆంధ్రపత్రికలో ప్రకటించబడును. పోటీదారులకు పూర్తి ఫలితములు 30–6–52 నాడు పంపబడును. ఫలితములకు 6 కానీబిళ్ళలు పంపాలి.

మేనేజరు: శ్రీనివాస్ పజిల్సు

జగన్నాధపురము : : కాకినాడ.

తీర్చుకున్నందుకు మనసులో మహా ఆనందించాను.

నిజమే. ఏదో ఒక వంక పెట్టి శంకరరావు తండ్రి అడ్రసు తెలుసుకుని, ఆయనను రప్పించవచ్చు కాని అలాంటిది శంకరరావు భవిష్యత్తుకి మంచిది కాదు. ఎప్పటికైనా అతనే తన ఆత్మహత్యోద్యోగం విరమించుకుని, కొంపకి చేరుకోవడం మంచిది. లేకపోతే తిరిగి అతను మరెప్పుడయినా ఇలాంటి ప్రయత్నం చేయవచ్చు. ఆనాడు నేను కాని తటస్థపడకపోతే అతని గతేం కాను? అని అనుకుని ఆ తలంపు విడిచిపెట్టాను.

మరి రెండు రోజులు అలాగే నిరాహారంగా గడిచాయి. మూడవ రోజు మధ్యాహ్నం అతను (శంకరరావు) కాలు కాలిన పిల్లిలా తిరగడం మొదలుపెట్టాడు. నెమ్మదిగా అతన్ని కదిలించి, నా దగ్గర బహు జాగ్రత్తగా మిగిల్చిఉంచిన డబ్బులతో మా ముప్వరికి కాఫీ తెప్పించాను. ఎంతో బలవంతంమీద కాని శంకరరావు కాఫీ త్రాగడానికి ఒప్పుకో లేదు.

అతని ధోరణి ఏమీ గమనించనట్లు నటిస్తూ నేను మా నరసింహాన్ని ఉద్దేశించి కొంచెం తీవ్రంగా మాట్లాడడం మొదలుపెట్టాను. “ఓరి నరిసిగా, కొంపముంచావు కదరా? ఇంటికి డబ్బు పంపమంటూ ఉత్తరం వ్రాసినట్లు వారంరోజుల క్రితమే చెప్పావు. ఆ ఉత్తరం తలగడక్రింద పెట్టుకుని పడుకుంటే వాళ్లు డబ్బు ఎలా పంపుతారనుకున్నావురా? నీ తస్సాదియ్యా. ఆ కార్డుముక్క ఈ రోజునయినా పోస్టు చెయ్యి మరి. నీకు పుణ్యం ఉంటుంది. మనతోపాటు ఈ పెద్దమనిషినికూడా బాధపెట్టాం కదురా! ఇప్పుడేమిటి చెయ్యడం? మన గతేమిటి? ముఖ్యంగా ఆయన గతేమిటి?” అని మావాణ్ణి నిందించాను. ఆ తరువాత శంకరరావువైపు తిరిగి “మీరు నిజంగా మమ్మల్ని క్షమించాలి. ఈ పొరపాటు తెలియక మీవద్ద డబ్బు తీసుకున్నాను. లేకపోతే తీసుకుని ఇంతటి పాపానికి ఒడిగట్టేవాణ్ణా? అయినా, ఇంతపని జరిగిన తరువాత ఏ మనుకుంటే ఏంలాభం” అన్నాను. అతను నాకేసి చూచి, “ఫరవాలేదు లెండి. ఎవరికైనా వస్తూ ఉంటాయి ఇలాంటివి” అన్నాడు.


## దాంపత్య రహస్యము

ఇది ప్రాచీన అసలు కొక్కోక గ్రంథము. (ఫోటోలతో) 264 పుటలు పుస్తకం వెల రు. 2-0-0 పోస్టుఖర్చులు ప్రత్యేకం, చంద్రభాను & కో, 27బీటు(AP)జి.టి.మద్రాసు.


మా నరసింహం ఈసారి అందుకుని “మా వాడు పోస్టుచేసే ఉంటాడని నేను, నేను చేస్తానని మావాడు అనుకుని ఇలా చేశాం, శంకరంగారూ” అన్నాడు.

నేను మళ్ళీ అందుకుని “నిజం చెప్పాలిసి వస్తే నేనైనా జరిగిందానికి అట్టే అంతగా విచారించడంలేదు. ముందు జరగబోయే దానికే బాధ పడుతున్నాను. ఇప్పుడు మన ఉత్తరం ఈరోజు పోస్టులో వేస్తే రెండు రోజులికి కాని అందదు. ఒకవేళ వాళ్లు వెంటనే మనిఆర్డరు పంపినా మనకి మరి అయిదారు రోజులవరకు డబ్బు చేరదు. అంతవరకు తిండిలేకపోయినా, నీరు లేకపోయినా నేను, నా నరసింహం ఎలాగో ఒకలాగు ప్రాణాలు అంటి పట్టుకుని ఉండగలం. పాపం, మీ గతేమిటి శంకరంగారూ? ఓరేయి నరిసింహం, నన్ను ఈవేళ తిండిలేకపోయేసరికే ఆయన ముఖం ఎలా అయిపోయిందో చూచావా? ప్రాణాలు కడంటిపోయాయి పాపం. అందులోనూ ఆయన ఆరోగ్యం అసలే మంచిదికాదు. ఇప్పుడు మళ్ళీ ఆరోగ్యం చెడితే ఆయన పరీక్ష ఏంకాను? డిస్టింక్షన్ రావలసిన మనిషి కాదురా? ఎంతపని జరిగింది” అంటూ మావాడిమీద రుసరుసలాడాను.

మావా డేమీ చలించకుండా “ఆయన పరీక్షగురించి నా కేమీ బెంగలేదురా అబ్బాయీ. చదవకపోయినా డిస్టింక్షన్ తెచ్చుకుంటాడులే. ఇప్పుడు భుక్తిమాట చూడు మొదట” అన్నాడు.

నేనొక పెద్ద నిట్టూర్పు విడిచి, శంకరరావుని ఉద్దేశించి ఇలా అన్నాను: “ఇంతవరకు వచ్చిన తరువాత దీనికిమాత్రం బిడియమెందుకు? నేను కూడా ఈ ఆకలి బాధకి తాళుకోలేక పోతున్నాను. మా నరసింహానికేం? నేను పరిశ్రమించి ఎక్కడో అక్కడ నాలుగు డబ్బులు ఒడుక్కుని వచ్చేవరకు నిశ్చలంగా సమాధిలో ఉంటాడు. ఆ తరువాత పీకలదాకా మెక్కి మళ్ళీ యోగనిద్రలో పడతాడు.

ఎవరూ ఏమీ బదులు చెప్పలేదు. స్వరం మార్చాను. అదోలా పోజు పెట్టి సోలిలకీ ధోరణిలో “ఈ సమయంలో ఈ ఊళ్లో మా మామగారి తోడల్లుడే కనుక ఉంటేనా? ఒక్కనాటికి తిండిలేకుండా చావడానికి ఒప్పుకోను. నాతో ఉండే వాళ్లని కూడా చావనివ్వను. అమాంతం ఆ తోడల్లుడిగారి కొంపమీదపడి, డబ్బుఇచ్చేదాకా వదలక, ఆఖరికి సత్యాగ్రహమైనా చేసి, దారిఖర్చులకి కూడా డబ్బు ఒడికి అక్కడినుంచి జెండా పీకెయ్యనూ? ఆ శంకరరావుగారి సంగతి చూడండి. ఊళ్ళో


# అతిమూత్రవ్యాధి వారం రోజులలో నెమ్మదించును

మూత్రంలో అధికంగా చక్కెరపోవటం అతిమూత్రవ్యాధిఅంటారు (Diabetes) ఇది యెంత ఉపద్రవకరమైన వ్యాధిఅంటే, దీని పాలబడినవారు ఆరోజు కారోజు మృత్యువుకు ఆసన్నమౌతుంటారు. దీనికి డాక్టర్లు ఇన్సులిన్ ఇన్జెక్షన్ మాత్రమే కనిపెట్టారు. వాటివల్ల వ్యాధి పూర్తిగా నయం కానేకాదు. ఇన్జెక్షన్ల గుణము వున్నంతకాలం మాత్రం చక్కెర తాత్కాలికంగా నిలిచిపోతుంది. ఈజబ్బు లక్షణాలలో ముఖ్యమైనవి దాహం, ఆకలి, తరచుగా చక్కెరతో మూత్రం బయలు వెడలటము. దురద మొదలైనవి ఈ వ్యాధి ముదిరితే రాచపుండు, కురుపులు, కంటిపొర ఇతర చిక్కులు సంభవించును. వీనస్ ఛారమ్ ఆధునిక శాస్త్రంలో అద్భుతమైన చికిత్స. దీన్ని వాడటం వల్ల వేనకు వేలమంది మృత్యుముఖంనుండి బయటపడ్డారు. దీన్ని వాడితే రెండవ లేక మూడవ రోజునుండే మూత్రంలో చక్కెర తగ్గించి అత్యధికమూత్రం గూడ నివారిస్తుంది. మూడు రోజుల తరువాత మీకు బాగా తేలిక యిస్తుంది దీనికి పత్యం లేదు. ఇన్జెక్షన్లు అవసరం లేదు. ఇంగ్లీషులో వివరములుగల కరపత్రానికి వ్రాయండి. ఉచితంగా పంపుతాము.

50 బిళ్లల బుడ్డి ఖరీదు రు 6-12-0 లు

ప్యాకింగు పోస్టేజి ఉచితము

వీనస్ రీసెర్చ్ లేబరేటరీ,

పోస్టుబాక్సు నం. 587, కలకత్తా (A. P. W)


మామగారి తోడల్లుడూ ఉన్నాడు. ప్రియమైన మరదళ్ళూ ఉన్నారు. వాళ్లకి డబ్బూ ఉంది. ఈయనకి వరపతీ ఉంది. అలాంటప్పుడు తిండికి కూడా లేక బాధపడుతూ, ఈ దిక్కుమాలిన సత్రంలో మనలాంటి జోగులతో బుజంబుజం రాసుకు తిరుగుతూ నానా అవస్థా పడుతున్నాడు. అంతేలే. లేక మనలాంటి నిర్భాగ్యులు విడిస్తే ఉండి కొందరు...” అంటూ మా వాడు యోగనిద్రనుంచి లేచి సంజ్ఞ సూచకంగా దగ్గడం మొదలుపెట్టగా నే విరమించాను.

ఆ తరవాత మాలో మాకు ఏలాంటి సంభాషణలు లేవు. మధ్యాహ్నం 3 గంటల వరకు అలాగే ఎవరి మూల వారు కూర్చుని ఉండిపోయాం. మా వాడు (నరసింహం)

సమాధిలోంచి నిజంగానే బయటపడి, తువ్వాలు భుజంమీద వేసుకుని, పనిఉందనైనా ఎవరితోటీ చెప్పకుండా బయటికి వెళ్ళిపోయాడు. నేను కడుపు నింపుకోడంకోసం కుళాయిదగ్గరికి చేరాను. అక్కడినుంచి అలా సెంట్రల్‌స్టేషన్ చేరుకుని, ముఖాలవేట సాగించి తిరిగి సత్రం చేరుకునేసరికి కొంచెం ఆలస్యమయింది. నేను వచ్చేసరికి శంకరరావు అక్కడలేడు. అదృశ్యమయ్యాడు. అతని బెడ్డింగుమాత్రం చక్కగా చుట్టబెట్టబడి ఉంది.

ఆ రాత్రి మెయిల్ టైమ్ గంట ఉందనగా నరసింహం సత్రం చేరుకున్నాడు. పక్కబట్టలు అవీ సర్ది, మెయిల్‌కి బయలుదేరడానికి సిద్ధంగా ఉండమని నాతో చెప్పి, టిక్కెట్లు కొనడానికి సెంట్రల్‌కి వెళ్ళిపోయాడు. వాడు తిరిగి వచ్చేసరికి నేను సిద్ధంగా ఉన్నాను. ఆ వెంటనే బండా పీకేసి మా ఊరికి బయలుదేరిపోయాం.

దారిలో నేను బాధించగా బాధించగా మావాడు నాతో శంకరరావు కథ ఎలా ముగిసింది ముక్తసరిగా నాలుగుమాటల్లో చెప్పాడు. వాడు చెప్పినదిది - నరసింహానికి మొదటనుంచి శంకరరావు సంగతంతా తెలుసు. ముఖ్యంగా అతని పినమామ గారితో పరిచయం ఉంది. మేము (నేను, శంకరం) విహారార్థం ట్రిప్‌కి వెళ్ళినప్పుడల్లా నరసింహం శంకరరావు పినమామగారి ఇంటికి వెళ్ళి ఆయనతో మాట్లాడి శంకరరావు విషయంలో ధైర్యం చెప్పి వస్తూ ఉండేవాడు. ఆయన ద్వారానే శంకరరావు తలితండ్రులకు కూడా ఇక్కడి కబుర్లు అందచేయించి, వారు ఎవరూ ఇక్కడికి రాకుండా మాత్రం చూడమనీ, లేకపోతే పరిస్థితి చెడుతుందనీ శంకరం పినమామగారితో చెప్పి, ఆ విషయంలో తగిన కట్టుదిట్టం చేశాడు. చివరకి ఆఖరిరోజు మధ్యాహ్నం ఆయన ఇంటికే వెళ్ళాడు. శంకరరావుకి వచ్చే ఉద్దేశ్యం ఏనాడో పోయిందని చెప్పాడు. ఇప్పుడు తిండిలేకపోవడంతో మనిషి బెంబేలుపడే స్థితివచ్చిందని కూడా అన్నాడు. కాని అవేవి తలపెట్టకుండా "పరీక్షలకోసమని రా బాబూ, నీకు ఇష్టంలేకపోతే మీ ఇంటికి వెళ్ళి, మీవాళ్ళని కలవనక్కర్లేదులే. ముందు పరీక్షకి వెడుదువుగాని, నీ ఇష్టంవచ్చినట్లు అన్నీ జరిగించే బాధ్యత నాది" అని శంకరరావుతో చెప్పి, అతన్ని ఎలాగో ఒకలాగు ఇంటికి తీసుకునిపోయి, ముందు కడుపునిండా ఇంత తిండి పెట్టమని నరసింహం శంకరరావు పినమామగారికి ఉపదేశించాడు.

అదే సమయంలో స్వవిషయం కూడా అందులోనే కలిపిచెప్పి, దారిఖర్చుకి మాత్రం ఆయనదగ్గర డబ్బు తీసుకున్నాడు. శంకరం పినమామగారికి మా అడ్రసు ఇచ్చి, ఇల్లు చేరుకోగానే డబ్బు తిరిగి పంపుతామని హామీ ఇచ్చి నరసింహం సత్రానికి బయలుదేరాడు.

శంకరం పినమామగారు, నరసింహము వేరొక దారిని సత్రంగుమ్మం చేరుకునేసరికి శంకరం అప్పుడే సత్రంగుమ్మం దాటి రోడ్ ఎక్కాడు. పినమామగారు కనపడగానే తన జీవితం ఇలా తయారయిందన్న దుఃఖమో, లేక సత్రంలో ఉంటున్నానన్న అభిమానమో శంకరరావు సిగ్గువిడిచి ఒక్కసారి ఘొల్లుమని పడ్డాడు. నరసింహం మాటలు బుర్రలో మెదుల్తున్నాయేమో శంకరాన్ని వాళ్ళ పినమామగారు వెంటనే ఆ పక్కనే ఉన్న హోటల్‌కి తీసుకొనిపోయారు. "శంకరరావు బెడ్డింగు సర్దుకుని ఉండడము, పినమామగారిని చూసి ఇక్కడకి ఎలాగ వచ్చాడా అని ఆశ్చర్యపడకపోవడము, పిల్లిలా ఆయనవెంటపడి పోవడము చూస్తే అతను వాళ్ళ మామగారిఇంటికి బయలుదేరిఉంటాడనిపిస్తోంది. నా రాయబారంవల్ల మన పని అయిందికాని శంకరం పినమామగారి కేమీ సహాయం జరుగలేదురా" అన్నాడు మా నరసింహం.

నా కథ మాత్రం ఇంకా ముగియలేదు. ఆ తరువాత ఏణ్ణార్ధం అయిఉంటుంది. మద్రాసులోనే ఒక పెద్ద బట్టల దుకాణంలో సేల్సుమన్‌గా పని చేసుకుంటున్నాను. నరసింహం కూడా అక్కడే ఒక కంపెనీలో టైపిస్టుగా ఉన్నాడు.

ఒకరోజు దుకాణంలో ప్రవేశిస్తూ ఉండగానే శంకరరావు నాదగ్గరికి వచ్చాడు. మునుపటికన్న ఆరోగ్యంగా బలంగా కనపడుతున్నాడు. అతని క్షేమసమాచారాలు అవీ తెలుసుకుని, కొంచెంసేపు పిచ్చాపాటీ చెప్పుకుని, కులాసాగా గడుపుదామనుకున్నాను. అతను నా ధోరణేమీ గమనించకుండా ముందుగానే "వెనక నాదగ్గర పుచ్చుకున్న పన్నెండు రూపాయల పదకొండు అణాలు ఇవ్వండి" అంటూ నిలదీసి గట్టిగా అడిగాడు. దుకాణంలో గట్టిగా మాట్లాడుకోటం బాగా ఉండదని, ఎలాగో బయటికి తీసుకువెళ్ళి "ప్రస్తుతం చేతిలో ఎర్రని రాగిదమ్మిడీ కూడా లేదు. అడ్రసు ఇచ్చివెళ్ళండి. తరువాత పంపుతాను" అని బ్రతిమాలాను. అతను ససేమిరా వల్లకాదు ఇప్పుడే ఇచ్చేయాలి అని కూర్చున్నాడు. అతని వరస చూస్తే మా యజమానిదగ్గరికికూడా వెళ్ళి, ఈ గొడవఅంతా చెప్పి, నా ఉద్యోగానికే ఎసరుపెట్టేలా ఉన్నాడు. ఇక లాభం లేదనుకుని "మధ్యాహ్నం 3 గంటలకి రండి. ఎక్కడో అక్కడ పుట్టించి మీకు ఇచ్చేసుకుంటాను" అని నచ్చచెప్పి అతన్ని పంపించేసరికి నా తాతలు దిగివచ్చారు.

ఠంచన్‌గా మధ్యాహ్నం 3 గంటలకే వచ్చిడబ్బు గుంజుకుపోయాడు. నామీద జాలివేసిందేమో కొంచెం నోరు విప్పి, "పరీక్షలో ఫస్టుక్లాసు వచ్చింది. గవర్నమెంటులో ఉద్యోగానికి దరఖాస్తు పెట్టి ఇంటర్‌వ్యూకోసం వచ్చాను. మగపిల్లవాడు పుట్టాడు" అని మాత్రం చెప్పి వెళ్ళిపోయాడు.

దుర్మార్గుడు. ప్రాణదాతపట్ల కృతజ్ఞత అణుమాత్రంకూడా లేదు. ఇలాంటివాళ్ళకి ఉపకారమే చేయకూడదు. ఆనాడు చావనివ్వవలసింది. అబ్బాయికి తెలిసొచ్చును అనుకున్నాను.

ఆ తరువాత కలుసుకున్నప్పుడు శంకరరావు ఎప్పుడు వచ్చింది. నా అడ్రసు ఎలా తెలుసుకున్నది మా నరసింహం చెప్పాడు.

నరసింహం అన్నదిది:

"శంకరరావు ఒకనాడు యాదృచ్ఛికంగా ట్రామ్‌లో తారసిల్లాడురా. నేనంటే కొంచెం గౌరవం ఉందేమో (నేనంటే లేనట్లు) బాగానే మాట్లాడాడు. ముందు చెయ్యబోయే ఘనకార్యాలు కూడా చెప్పాడు. నేనే నీ అడ్రసు ఇచ్చి దారి చెప్పి నీ దగ్గరికి పంపాను. జాగ్రత్తగా అడ్రసు తెలుసుకున్నట్లు, నువ్వు వెనకటి బాకీ అణాపైసలతో తీర్చివేసినట్లు చెప్పి ఈ ఊరునుంచి వెళ్ళిపోయాడు.

"నా పెళ్ళాం బిడ్డల ఆరోగ్యంగురించి అడిగాడు. ఘోటకబ్రహ్మచారిని నన్ను పట్టుకుని నాకు పెళ్ళయినట్లు పిల్లలు కూడా ఉన్నట్లు చెప్పావటగా? ముక్కుపిండించి నీ దగ్గర డబ్బు వసూలుచేయించాను. దొంగవెధవ్వి, నీకు తగ్గశాస్తి అయిందా?" ★

మురళీ క్రాసువర్డ్సు
పోటీ నెం. 14-సీలు ఆన్సరు
1 1 2 2 2 2 1 2 2 2 2 2 2
మురళీ క్రాసువర్డ్సు
పలమనేరు (చిత్తూరు జిల్లా)

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St., Madras